పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



బహుమతులతో విద్యార్థులు, అధికారులు

మద్దిపాలెం : స్వచ్ఛతా హీ సేవా – 2024కు సంబంధించి చిత్ర లేఖన, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ మేరకు జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ) కార్యాలయంలో విజేతలకు రీజినల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ముకుందరావు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం జోనల్ ఆఫీస్ ఇంజినీర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరూ పర్యావరణ హితంగా జీవించాలన్నారు, కాలుష్య నియంత్రణపై అందరికీ విద్యార్థులు అవగాహన కల్పించాలని సూచించారు. జోనల్ కార్యాలయం మేనేజర్ బి.శ్రీనివాసరావు, ఏఈ శ్రీలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నంపాల్గొన్నారు.

50 మంది లైసెన్సుల రద్దు



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార : స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ పోలీసులు శనివారం కూడా పలు ప్రాంతాల్లో తనిఖీలు కొనసాగించారు. ద్వారకా ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో గల సీతమ్మధార, పీ అండ్ టీ కాలనీలో ఎస్ఐ ఎస్.వి.భాస్కరరావు పర్యవేక్షణలో వాహనచోదకులను విస్తృతంగా తనిఖీ చేశారు. హెల్మెట్ లేని 50 మంది డ్రైవింగ్ లైసెన్సులను మూడు నెలలపాటు తాత్కాలికంగా రద్దు చేసి, రూ.5,350 జరిమానా విధించారు. ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లిన డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రిబుల్ రైడింగ్, రాంగ్‌రూట్, ర్యాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్ వాహన చోదకులకు అవగాహన కల్పించారు. తనిఖీల్లో షేక్ షకీల్, రవిరాజు, హోంగార్డు కరుణాకర్ పాల్గొన్నారు.

'పడమటీది నాటకం' పుస్తకావిష్కరణ



కవితా సంపుటి ఆవిష్కరిస్తున్న ఆచార్య కేఎస్ చలం, తదితరులు

సీతంపేట : అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రచయిత మిరప మహేష్ రచించిన 'పడమటీది నాటకం' కవితా సంపుటిని యూపీఎస్సీ పూర్వ సభ్యులు ఆచార్య కె.ఎస్.చలం శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన కొన్ని కవితలు చదివి విశ్లేషించి మహేష్‌ను అభినందించారు. సాహితీ విశ్లేషకులు మాటూరి శ్రీనివాస్ కవితా సంపుటిని విశ్లేషిస్తూ కవిత్వంలోని ప్రత్యేకతలు వివరించారు. సభలో ఉప్పల అప్పలరాజు, మేడా మస్తాన్‌రెడ్డి, డి.వి.సూర్యారావు, యస్.హనుమంతరావు, బండి సత్యనారాయణ, సి.యస్.క్షేత్రపాల్ రెడ్డి, మోకా రత్నరాజు, బసు పోతన, పీఈఏ రాజు పాల్గొన్నారు.

సింగరాయిమెట్టలో అన్నసమారాధన



ఎస్ఐ దివ్యభారతితో యూత్ సభ్యులు

మురళీనగర్ : మురళీనగర్ సమీపంలోని సింగరాయిమెట్ట బాలయోగి గుడి వద్ద బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదో పట్టణ పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ దివ్యభారతి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమెను యూత్ సభ్యులు సత్కరించారు. సనపల వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దుకాణం యజమాని దౌర్జన్యంపై ఫిర్యాదు

సీతమ్మధార : కోర్టులో కేసు నడుస్తున్నా సరే దుకాణం యజమాని దౌర్జన్యం చేసి ఫ్లోర్‌మిల్లు సామగ్రి రోడ్డుపై పడేశారని ఓ వ్యక్తి ద్వారకా పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... సీతంపేటలో ముక్క పూర్ణచంద్రప్రసాద్ అద్దెకి తీసుకున్న దుకాణంలో 2006 నుంచి శ్రీ సిరి చందన ఫ్లోర్‌మిల్లు నడుపుతున్నారు. శనివారం ఆయన ఎప్పటిలాగానే షాపు తెరిచి పూజ చేస్తుండగా, దుకాణం యజమాని 30 మంది యువకులతో వచ్చి దౌర్జన్యం చేసి ప్రసాద్‌ను పక్క దుకాణంలో బంధించారు. అనంతరం ఫ్లోర్‌మిల్లులో గల సామగ్రిని రోడ్డుపై పడేశారు. దుకాణం విషయంలో యజమానితో కోర్టులో కేసు నడుస్తోందని ప్రసాద్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు, కుటుంబానికి దుకాణం యజమాని నుంచి రక్షణ కల్పించాలని, కోర్టు కేసు తేలే వరకు వ్యాపారం చేసుకునేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రసాద్ కోరారు. ద్వారకా సీఐ డి.వెంకటరమణ పర్యవేక్షణలో ఎస్ఐ ధర్మేంద్ర ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతీ రాత్రీ అమావాస్యే..!



బాలయ్య శాస్త్రి లే అవుట్ నుంచి నార్త్ ఎక్స్‌టెన్షన్‌కు వెళ్లే రోడ్డులో వీధి లైట్లు వెలగక అంధకారం

- అధ్వానంగా వీధి లైట్ల వ్యవస్థ
- అంధకారంలో పలు కాలనీలు
- పట్టించుకోని జోన్ – 3 అధికారులు



అల్లూరి విగ్రహం నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో వెలగని విద్యుత్ లైటు



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డులో వెలగని లైట్లు

సీతమ్మధార : జీవీఎంసీ జోన్ – 3 పరిధిలోని పలు కాలనీల్లో పరిస్థితి ప్రతీ రాత్రీ అమావాస్యే అన్నట్లుగా ఉంటోంది. ముఖ్యంగా ఉత్తర నియోజకవర్గంలోని చాలా కాలనీల్లో అంధకారం రాజ్యమేలుతోందని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జోన్ – 3 పరిధిలో సుమారు 8 వేల వరకు వీధి లైట్లు ఉన్నాయి. వీటిలో సుమారు 20 శాతం వరకు లైట్లు వెలగడం లేదని అధికారుల ప్రాథమిక అంచనా. సీతమ్మధార, సత్యం జంక్షన్, గాంధీనగర్, క్రాంతినగర్, నక్కవానిపాలెం, రేసపువానిపాలెం, బాలయ్యశాస్త్రి లే అవుట్, రాధాకృష్ణ లే అవుట్, టీపీటీ కాలనీ, పీ అండ్ టీ కాలనీ తదితర ప్రాంతాల్లో లైట్లు సక్రమంగా వెలగడం లేదని స్థానికులు వాపోతున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగలు కూడా నిక్షేపంగా లైట్లు వెలుగుతున్నాయని... అవసరమైన చోట మాత్రం రాత్రి వేళ వెలగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ పాఠశాల పరిసర ప్రాంతాల్లో వీధి లైట్లు వెలగక రాత్రి పూట అంధకారం నెలకొంటోందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. విధులు ముగించుకుని ఇంటికెళ్లే ఉద్యోగులు చీకటిలో పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా ఇక్కడి మోడ్రన్ లైట్లు వెలగడం లేదు. ఒక పోల్‌కి రెండు లైట్లు వుంటే ఒక లైటు వెలగడం లేదు. ఒక్కోచోట లైట్లే మాయమైపోయాయి. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు అడ్డంగా వుండడంతో వీధి లైట్లు వెలిగినా అంధకారం నెలకొంటోందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు అంధకారం, మరోవైపు కుక్కల బెడద కారణంగా రాత్రి పూట పాదచారులు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానిక నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే...

ఏదో ఒక ప్రాంతంలో నిత్యం వీధి లైట్లు వెలగకపోయినా అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా వీధిలైట్ల నిర్వహణ కాంట్రాక్ట్ దక్కించుకున్న బీ అండ్ ఆర్ సంస్థ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. కాంట్రాక్టర్ మీద జీవీఎంసీ ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో వీధిలైట్ల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఇటీవల నిర్వహించిన మీడియా సమావేశంలో సుమారు ఐదు వేల వీధిలైట్లు వెలగడం లేదని ప్రకటించారంటే క్షేత్ర స్థాయిలో పరిస్థితి ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులంతా విధిగా రోజూ రాత్రి పూట వీధుల్లో పర్యటించి... వెలగని వీధిలైట్ల నంబర్లు నోట్ చేసుకుని కాంట్రాక్టర్ ద్వారా మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. అయినప్పటికీ ఒక్కరూ క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదని, అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల తామంతా చీకటిలో మగ్గిపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అభయాంజనేయ స్వామి ఆలయం రోడ్డులో వెలగని లైట్లు

ఫిర్యాదు చేస్తున్నా ప్రయోజనం శూన్యం

వీధిలైట్లు వెలగకపోవడంపై ఫిర్యాదు చేస్తున్నా జోన్ – 3 ఇంజినీర్లు మరమ్మతులు చేయించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో వీధిలైట్ల నిర్వహణ, మరమ్మతుల కోసం ప్రత్యేకంగా ఇంజినీర్లు వుండేవారు. గత ఏడాది జూన్‌లో వీరి స్థానంలో పబ్లిక్ వర్క్స్ ఇంజినీర్లకే వీధిలైట్ల నిర్వహణ బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో ఆ శాఖ అధికారులు పని ఒత్తిడి కారణంగా వీధిలైట్ల నిర్వహణ మీద అంతగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. ప్రతీ కౌన్సిల్ సమావేశంలోనూ కార్పొరేటర్లు వీధిలైట్లు వెలగడం లేదని ఫిర్యాదు చేస్తున్నా ప్రయోజనం శూన్యమే. మరోవైపు కూటమి ప్రభుత్వం వచ్చాక వార్డు వలంటీర్ వాట్సాప్ గ్రూపులు లేకపోవడం, సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శుల మొబైల్ నంబర్లు అందుబాటులో లేకపోవడంతో ఫిర్యాదులు చేయడానికి ప్రజలు అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెలగని వీధిలైట్లకు మరమ్మతులు చేయించాలని, మాయమైన వాటి స్థానంలో కొత్త లైట్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



హెచ్‌బీ కాలనీ నుంచి సీతమ్మధార వెళ్లే రోడ్డులో వెలగని విద్యుత్ లైట్లు



ఎల్ఐసీ రోడ్డులో వెలగని లైట్లు

మరమ్మతులు చేయడం లేదు

ఏడాదిన్నర కాలంగా కాంట్రాక్టర్, సిబ్బంది సకాలంలో ఫిర్యాదులు పరిష్కరించడం లేదు. ఫలితంగా వీధుల్లో చీకట్లు అలుముకుంటున్నాయి. గతంలో వార్డు వలంటీర్ గ్రూపుల ద్వారా ఫిర్యాదు చేసుకోవడానికి ఆస్కారం ఉండేది. ఇప్పుడు సచివాలయంలో నేరుగా ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

– గోవర్ధన్ రెడ్డి, ఎంఎంటీసీ కాలనీ

అధికారుల పర్యవేక్షణ లేకే...

జోన్ – 3 పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి పూట లైట్లు వెలగడం లేదని బాధపడుతుంటే, మరి కొన్ని ప్రాంతాల్లో పగటి పూట కూడా లైట్లు వెలుగుతున్న విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కాంట్రాక్టర్ మీద జీవీఎంసీ ఇంజినీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధిలైట్లు వెలిగించాలి.

– జ్ఞానేందర్, బాలయ్యశాస్త్రి లే అవుట్

రాజకీయాల్లోనూ పవన్ నటించడం సరికాదు

సీతమ్మధార : ఉప ముఖ్యమంత్రి, సినిమా హీరో పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోనూ నటించడం బాధాకరమని కాంగ్రెస్ నాయకుడు జగన్‌మురారి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన సినిమాల్లో నటిస్తే గౌరవిస్తారని, రాజకీయాల్లోనూ నటిస్తే ప్రజలు ఛీకొడతారన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం విషయంలో పవన్ చేసినంత హడావిడి ఇంకెవరూ చేయలేదని ఎద్దేవా చేశారు. లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు వాడారని ఆధారాలు లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇష్టారాజ్యంగా ప్రకటించేశారన్నారు. అది నిజమా..? కాదా..? అని నిర్ధారించుకోకుండానే పవన్ దీక్ష చేయడం, మతాల మధ్య విద్వేషాలు పెంచేలా మాట్లాడడం రాజకీయ ప్రయోజనాల కోసమే అని అందరికీ అర్థమవుతోందన్నారు. బీజేపీ డైరెక్షన్‌లోనే రాజకీయాల్లోనూ పవన్ నటిస్తున్నారని జగన్ మురారి ఆరోపించారు. తన చేతిలో ఉన్న శాఖల పనితీరు పట్టించుకోకుండా సనాతన ధర్మ రక్షకుడిగా అవతరించాడని ఎద్దేవా చేశారు.

మద్యానికి బానిసై ఆత్మహత్య

సీతమ్మధార : మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సబ్బవరపు మనోజ్ (28) సాలిగ్రామపురం సింహగిరి కాలనీ పోర్టు క్వార్టర్స్ బ్లాక్ – 63లో తండ్రితో కలిసి నివసిస్తున్నాడు. ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తండ్రి సబ్బవరపు గణేష్ (58) బొంతల తయారీ దుకాణంలో కూలీగా పనిచేస్తుండేవాడు. గణేష్ మద్యానికి బానిసై కొంత కాలంగా కుటుంబాన్ని పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు కుమారుడు మనోజ్‌కు విషయం తెలియజేశారు. అతని ఫిర్యాదుతో పోలీసులు మృతదేహాన్ని కేజీహెచ్‌కి తరలించారు. నాలుగో పట్టణ సీఐ విజయకుమార్ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నిబంధనల ప్రకారమే నవరాత్రి ఉత్సవాలు



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ రమణ

సీతమ్మధార : దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు నిబంధనలు పాటించాలని ద్వారకా స్టేషన్ సీఐ డి.వెంకట రమణ కోరారు. ఉత్సవాల నిర్వాహకులతో పోలీసు స్టేషన్‌లో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొందరు నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించడంతో నోటీసులు ఇచ్చామని గుర్తు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్వాహకులకు ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా ఆదేశాలు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. చుట్టుపక్కల ప్రజలకు, ట్రాఫిక్‌కి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కోరారు. దుర్గాదేవి మండపం వద్ద మైకుసెట్ ఉదయం 6 గంటల నుంచి రాత్రి పది వరకు మాత్రమే తక్కువ సౌండ్‌తో వినియోగించాలన్నారు. పెద్ద శబ్దాలతో చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇతర మతాల ప్రార్థనా మందిరాలకు సమీపంలో దుర్గాదేవి మండపాలు ఏర్పాటు చేసిన వారు ఇబ్బంది కలిగించొద్దని సూచించారు. ప్రతీ మండపం వద్ద పాయింట్ బుక్ ఉండాలని, బీట్ కానిస్టేబుల్ తనిఖీ అనంతరం అందులో సంతకం చేస్తారన్నారు. పోలీసులు సూచించిన మార్గంలోనే అనుపోత్సవం నిర్వహించాలని సీఐ స్పష్టం చేశారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసులతో సహకరించాలని కోరారు. సమావేశంలో ద్వారకా స్టేషన్ ఏఎస్ఐ గంగాధరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డిప్లమాతో విస్తృత అవకాశాలు



ప్రసంగిస్తున్న డాక్టర్ సుధాకర్ పట్నాయక్

మురళీనగర్ : డిప్లమాతో అందుబాటులో ఉన్న విస్తృత ఉద్యోగావకాశాలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.సుధాకర్ పట్నాయక్ సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన వార్షికోత్సవం, ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతీ వ్యక్తి జీవితంలో ఆరోగ్యం, విద్య ప్రధానమైనవన్నారు. కాలేజీలో బాలికలు ఉద్యోగ సాధనలో ముందంజలో ఉండడం ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలని సూచించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బొబ్బిలి శ్రీరామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించినప్పుడే ఉన్నతావకాశాలు పొందగలన్నారు. అనంతరం శ్రీరామమూర్తి మాస్టారును ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ ఘనంగా సత్కరించారు. అనంతరం టి.తులసీరామ్, ఐ.చైతన్యపావని, జి.లిఖితలకు మహీంద్రా కంపెనీ ఉపకార వేతనాలు అందించారు. సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంత కుమారి, డి.దామోదరరావు, డాక్టర్ ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం



సమావేశంలో ప్రసంగిస్తున్న రంగారావు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని వాకర్స్ డిస్ట్రిక్ట్ – 101 గవర్నర్ టి.రంగారావు అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన శనివారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. క్లబ్‌కు నిధులు పెంచడంలో కార్యవర్గం చేసిన కృషిని ప్రశంసించారు. అనంతరం చంద్రమౌళి మాట్లాడుతూ పార్కులో పచ్చదనం పెంపొందించేందుకు ఇటీవల 600 మొక్కలు నాటామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు అనువుగా సభా ప్రాంగణాన్ని విస్తరించామన్నారు. క్లబ్‌లో 30 మంది నూతన సభ్యుల చేరికతో రూ.1.5 లక్షలు మూలనిధికి జమయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనాథం, పూర్వ అధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, కె.ద్వారకానాథ్, కార్యదర్శి సీహెచ్ ప్రసాదరావు, కోశాధికారి జె.కూర్మారావు, ఉపాధ్యక్షులు ఏవీ సుబ్బారావు, ఎం.రామకృష్ణ, జాలీ వాకర్ ఎన్.ప్రకాశరావు, పి.శ్రీనివాసరావు, ఆర్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వేధిస్తున్న తమ్ముడిపై అన్న దాడి

మద్దిపాలెం : నిత్యం గంజాయి మత్తులో తూలుతూ తల్లితోపాటు ఇతర కుటుంబ సభ్యులను వేధిస్తున్న తమ్ముడిపై అన్న దాడి చేశాడు. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కంచరపాలెం ఇందిరానగర్ – 1లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తోన్న కొప్పల కుమార్ (32) గంజాయి, మద్యానికి బానిసై నిత్యం తల్లితోపాటు కుటుంబ సభ్యులను వేధిస్తున్నాడు. కొన్నాళ్లుగా తమ్ముడి తీరు గమనిస్తున్న అన్నయ్య సురేష్ శనివారం ప్రశ్నించాడు.

అప్పటికే మత్తులో ఉన్న కుమార్ వెంటనే సురేష్‌పై కత్తితో దాడికి యత్నించాడు. తప్పించుకునే క్రమంలో సురేష్ సమీపంలోని సుత్తితో కుమార్‌ను కొట్టాడు. అనంతరం కుమార్‌ను కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్పించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అమ్మవు నీవే అఖిల జగాలకు..

- అన్నపూర్ణ దేవిగా అమ్మవారు దర్శనం
- భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి మహోత్సవాలు



అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు



మీనాక్షి దేవిగా దర్శనమిచ్చిన దుర్గాదేవి



అన్నపూర్ణా దేవి అలంకారంలో భూలోకమాత



సీతంపేటలో అన్నపూర్ణగా పార్వతీ దేవి



శ్రీలలితాపీఠంలో లలితాదేవి ఉత్సవమూర్తి

సీతంపేట : దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో సుదర్శన హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య హోమం శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం చండీ పారాయణ, గోపూజ, శత చండీ పారాయణ, మణిద్వీపంలో శ్రీచక్రనవావరణ జరిపారు. సాయంత్రం మహిళలు సామూహిక లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. ఆదివారం ఉదయం పీఠంలో మహా సౌర అరుణ హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

- సీతంపేట పార్వతీశ్వరాలయంలో పార్వతీ దేవి శనివారం అన్నపూర్ణా దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన జరిపారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కర శర్మ పూజలు చేశారు.
- జీవీఎంసీ 44వ వార్డు శ్రీనివాస నగర్‌లో శ్రీదుర్గా మహిళా పూజా కమిటీ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మవారికి 51 రకాల పిండి వంటలతో మహా నైవేద్యం సమర్పించారు. చుట్టు పక్కల నివసిస్తున్న మహిళలు ఒక్కొక్కరు ఒక్కో పిండి వంట తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. ముందుగా అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. గత 28 ఏళ్లుగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, రోజూ విశేష పూజలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం సాయంత్రం అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు.

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ భూలోకమాత అమ్మవారి ఆలయంలో రేసపువానిపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ అమ్మవారికి పంచామృతాభిషేకం, దివ్య అలంకారం, హోమం, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

మద్దిపాలెం : జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్నగార్డెన్స్‌లో కొలువైన శ్రీ కనక మహాలక్ష్మి, గాయత్రిదేవి, కనకదుర్గా దేవి ఆలయంలో అమ్మవారు శనివారం అన్నపూర్ణగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పూజల్లో పాల్గొన్నారు.

మీనాక్షిదేవిగా దుర్గాదేవి అమ్మవారు

సీతమ్మధార : జీవీఎంసీ 14వ వార్డు పరిధి సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో గల శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీ సాయిబాబా దేవస్థానంలో అమ్మవారు మీనాక్షి అవతారంలో దర్శనమిచ్చారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలోని లలితాంబికా దేవి శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు భోగాపురపు ప్రసాద శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమార్చనలో మహిళలు పాల్గొన్నారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్, కోశాధికారి శ్రీనివాస్, ఈవెంట్ నిర్వాహకుడు ఆనందరావు, పి.రామరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



అన్నపూర్ణదేవిగా లలితాంబికాదేవి



శ్రీలలితాపీఠంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు



శ్రీనివాసనగర్‌లో 51 రకాల పిండివంటలతో దుర్గాదేవికి మహా నైవేద్యం

అలరించిన కామాక్షి వైభవం



వీణా విద్వాంసురాలు బండి శ్యామలను సత్కరిస్తున్న మండా సుధారాణి, పద్మ

సీతంపేట : దుర్గా శరన్నవరాత్రుల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో బీవీకే కళాశాలలో శనివారం వీణానాదార్చన చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వీణా విద్వాంసురాలు బండి శ్యామలను మహతి నాద నిధి బిరుదుతో సత్కరించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు మండా సుధారాణి, పప్పు పద్మ ఆమెను ఘనంగా సత్కరించారు. కామాక్షి అమ్మవారి వైశిష్ట్యాన్ని తెలిపేలా నిర్వహించిన 'శ్రీ కామాక్షి వైభవం' ఆహూతులను అలరించింది. కామాక్షి దేవత విశిష్టతను తెలిపేలా కృతులను సునయన, వైష్ణవి, విష్ణుప్రియ, ఆర్.ఎల్.కృష్ణప్రియ, ఎస్‌వీఎస్ఎల్ ప్రసన్న, ఎన్.కృష్ణప్రియ అద్భుతంగా ఆలపించారు. వీరికి ఎస్.కృష్ణవేణి, ఎస్.పార్థివ, ఏడుకొండలు, ఎస్.హనుమంతరాబవు వాద్య సహకారం అందజేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com